అక్సియాడో హైదరాబాద్ ఆఫీస్ విస్తరణ

హైదరాబాద్, మార్చి 18: అమెరికాకు చెందిన టెక్నాలజీ కంపెనీ అక్సియాడో.. తన వ్యాపార విస్తరణలో భాగంగా హైదరాబాద్ కార్యాలయాన్ని మరింత విస్తరించబోతున్నది. వచ్చే ఏడాదిన్నరలోగా మరో 100 మంది టెక్నాలజీ నిపుణులను నియమించుకోనున్నట్లు అక్సియాడో సీఈవో గోపి శ్రీనేని తెలిపారు. సిరీస్-సీలో భాగంగా నిధులను సమీకరించిన సంస్థ.. వీటిని వ్యాపార విస్తరణకు వినియోగించనున్నట్లు ప్రకటించారు. ప్రస్తుతం భారత్‌తోపాటు తైవాన్‌లలో ఉన్న కార్యాలయాల్లో 150 మంది ఉద్యోగాలు పనిచేస్తున్నారు.

జార్జ్ సోరోస్ ఆఫీస్‌లపై ఈడీ దాడులు

న్యూఢిల్లీ/బెంగళూరు, మార్చి 18: అమెరికా బిలియనీర్ జార్జ్ సోరోస్‌కు చెందిన ఓపెన్ సొసైటీ లబ్ధిదారులపై ఈడీ దాడులు నిర్వహించింది. జార్జ్ సోరోస్‌కు చెందిన ఓపెన్ సొసైటీ లబ్ధిదారులు విదేశీ పెట్టుబడులు స్వీకరిస్తున్నారని, కొందరు ఫెమా నిబంధనలు ఉల్లంఘించి ఖర్చు చేస్తున్నారని ఈడీ ప్రధాన ఆరోపణ. దీంతో సోరోస్‌కు చెందిన బెంగళూరులోని ఓపెన్ సొసైటీ ఫౌండేషన్స్ , దాని ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ ఎకనామిక్ డెవలప్‌మెంట్ ఫండ్ కార్యాలయాల్లో ఈడీ సోదాలు నిర్వహించింది.

వాహనాలు ప్రియం!

న్యూఢిల్లీ, మార్చి 18: మరో మూడు వాహన సంస్థలు ధరలు పెంచబోతున్నట్లు ప్రకటించాయి. ఇప్పటికే మారుతి సుజుకీ తన వాహన ధరల పెంచుతున్నట్లు ప్రకటించగా..తాజాగా ఈ జాబితాలోకి టాటా మోటర్స్, కియా, మెర్సిడెజ్ బెంజ్‌లు చేరాయి. కమర్షియల్ వాహనాలను ఇప్పటికే పెంచిన టాటా మోటర్స్..తాజాగా మంగళవారం ప్యాసింజర్ వాహన ధరలను కూడా సవరిస్తున్నట్లు వెల్లడించింది. వచ్చే నెల మొదటి నుంచి అందుబాటులోకి రానున్న ఈ ధరలు ఎంత శాతం పెంచుతున్న విషయాన్ని వెల్లడించలేదు. అలాగే ఉత్పత్తి వ్యయం అధికంకావడంతో వచ్చే నెల నుంచి మూడు శాతం వరకు వాహన ధరలను పెంచుతున్నట్లు కియా ఇండియా ప్రకటించింది.

నెలాఖరుకల్లా ఆరోగ్య బీమాలోకి!

హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీలో వాటా కొనుగోలుపై తుది దశకు చర్చలు ● ఎల్ఐసీ సీఈవో సిద్ధార్థ మహంతి

ముంబై, మార్చి 18: ప్రభుత్వ రంగ జీవిత బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ).. ఆరోగ్య బీమాలోకి ఈ నెలాఖరుకల్లా అడుగు పెడుతామన్న విశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నది. వచ్చే రెండు వారాల్లో ఓ ఆరోగ్య బీమా కంపెనీలో వాటాను చేజిక్కించుకుంటామన్న ఆశాభావాన్ని మంగళవారం ఎల్ఐసీ ఎండీ, సీఈవో సిద్ధార్థ మహంతి వెలిబుచ్చారు. అయితే ఏ హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీలో వాటాను కొనబోతున్నారో అనేది చెప్పని మహంతీ.. మార్చి 31లోగా కొంటామన్న నమ్మకాన్ని మాత్రం కనబర్చారు. ఇక్కడ జరిగిన జీసీఏ25 కార్యక్రమానికి హాజరైన ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 'ఆరోగ్య బీమాలోకి ఎల్ఐసీ రావడం అనేది సహజం. ఈ అంశంపై తుది దశలో చర్చలున్నాయి' అన్నారు. అయితే హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీలో మెజారిటీ (51 శాతం) వాటా కొనబోమని, అయినప్పటికీ ఎంత? కొనాలన్నది కంపెనీ బోర్డు నిర్ణయిస్తుందన్నారు. కాగా, మణిపాల్‌సిగ్నాలో రూ.4,000 కోట్లతో వాటాను ఎల్ఐసీ కొనబోతున్నదన్న ప్రచారం జరుగుతున్నది.

వందేండ్ల బాండ్లు ఇవ్వండి

దీర్ఘకాలిక ప్రభుత్వ బాండ్లను జారీ చేయాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ)కు ఎల్ఐసీ విజ్ఞప్తి చేసింది. వందేండ్ల బాండ్లైనాసరే తేవాలని మహంతి కోరారు. జీవిత పాలసీలను అమ్ముతున్నందున దీర్ఘకాలిక బాండ్లలో పెట్టుబడుల అవసరం ఉన్నదన్నారు. కాగా, 20-30 ఏండ్ల బాండ్లకు ఆర్బీఐ అనుమతినిస్తూ వస్తున్నది. ఈ క్రమంలో 40 ఏండ్ల బాండ్లకూ సుముఖత వ్యక్తం చేస్తున్నదన్న మహంతీ.. ముున్ముందు 50 ఏండ్లు, 100 ఏండ్ల బాండ్లనైనా జారీ చేస్తారన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఇదే విషయమై ఆర్బీఐతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతున్నట్టు మీడియాకు చెప్పారు. నిజానికి చాలా దేశాలు అంతర్జాతీయ మార్కెట్‌లో 100 ఏండ్ల బాండ్లను జారీ చేస్తున్నాయని గుర్తుచేశారు. అయితే భారత్ మాత్రం ఇప్పటికీ సదరు బాండ్ల జోలికి వెళ్లడం లేదని, దీనికి డిమాండ్ పరిమితంగా ఉండటం, సెకండరీ మార్కెట్‌లో తక్కువ కార్యకలాపాలే కారణం కావచ్చన్నారు.

91 వేలు దాటిన పుత్తడి

రూ.500 అధికమైన పదిగ్రాముల ధర

న్యూఢిల్లీ, మార్చి 18: బంగారం ధరలు మరో చారిత్రక గరిష్ఠ స్థాయికి ఎగబాకాయి. అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహాల ధరలకు డిమాండ్ నెలకొనడంతో దేశీయంగా ధరలు మరో మైలురాయి రూ.91 వేలను అధిగమించాయని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. క్రితం రోజు ముగిసినదాంతో పోలిస్తే రూ.500 పెరిగిన పదిగ్రాముల బంగారం ధర రూ.91,250కి చేరుకున్నది. అలాగే 99.5 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల గోల్డ్ ధర రూ.450 అధికమై రూ.90,800కి చేరకుఉన్నది. గోల్డ్ ధరలు దేశీయంగా, అంతర్జాతీయంగా రికార్డు స్థాయికి ఎగబాకాయని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ వర్గాలు సౌమిల్ గాంధీ తెలిపారు. ఇటు హైదరాబాద్ మార్కెట్లో పదిగ్రాముల గోల్డ్ ధర రూ.440 అధికమై రూ.90 వేలకు చేరుకోగా, 22 క్యారెట్ ధర రూ.400 అధికమై రూ.82,500కి చేరుకున్నది.

వెండి యథాతథం

ఒకవైపు బంగారం రికార్డుల మీద రికార్డులు బద్దలు కొడుతుంటే మరోవైపు వెండి సెంచరీ దాటి యథాతథంగా కొనసాగుతున్నది. ఢిల్లీ బులియన్ మార్కెట్లో కిలో వెండి రూ.1,02,500గా నమోదైంది. ఇటు హైదరాబాద్ మార్కెట్లో కిలో వెండి రూ.1,100 ఎగబాకి రూ.1.13 లక్షలకు చేరుకున్నది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 3,028.49 డాలర్లు పలుకగా, వెండి 34 డాలర్ల వద్ద ఉన్నది.

రూ.8.67 లక్షల కోట్లు

- రెండు రోజుల్లో పెరిగిన మదుపరుల సంపద
- మరో 1,131 పాయింట్లు పుంజుకున్న సెన్సెక్స్
- మళ్లీ 75వేల మార్కును అందుకున్న సూచీ
- 326 పాయింట్లు ఎగబాకిన నిఫ్టీ

ముంబై, మార్చి 18: దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాల జోష్‌లో కదలాడుతున్నాయి. వరుసగా రెండోరోజూ సూచీలకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఈ క్రమంలోనే మదుపరుల సంపద లక్షల కోట్ల రూపాయల్లో పెరిగింది. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ)లో నమోదైన కంపెనీల మార్కెట్ విలువ రూ.8.67 లక్షల కోట్లు ఎగిసింది. సోమవారం లాభాలనూ పరిగణనలోకి తీసుకుంటే సెన్సెక్స్ 1,472.35 పాయింట్లు పుంజుకోవడం కలిసొచ్చింది. ఇక మంగళవారం ఐసీఐసీఐ బ్యాంక్, ఎల్‌అండ్‌టీ, మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా మోటర్స్, ఏషియన్ పెయింట్స్ తదితర షేర్లను కొనేందుకు ఇన్వెస్టర్లు అమితాసక్తిని కనబర్చారు. రియల్టీ, ఇండస్ట్రియల్స్, కన్స్యూమర్ డిస్క్రిషనరీ, క్యాపిటల్ గూడ్స్, ఆటో, పవర్, ఆర్థిక సేవలు, బ్యాంకింగ్ రంగాల షేర్లు మెరిశాయి. ఈ క్రమంలోనే బీఎస్ఈ సెన్సెక్స్ 1,131.31 పాయింట్లు లేదా 1.53 శాతం ఎగిసి 75వేల మార్కుకు ఎగువన 75,301.26 వద్ద స్థిరపడింది. ఒకానొక దశలో 1,215.81 పాయింట్లు ఎగబాకింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ కూడా 325.55 పాయింట్లు లేదా 1.45 శాతం పెరిగి 22,834.30 వద్ద నిలిచింది. అంతర్జాతీయ మార్కెట్లలో ముడి చమురు ధరలు తగ్గుముఖం పట్టడం, భారత్‌సహా చాలా దేశాల కరెన్సీలతో చూస్తే డాలర్ విలువ బలహీనపడటం.. మార్కెట్ సెంటిమెంట్‌ను పెంచిందని నిపుణులు తాజా ట్రేడింగ్ సరళిని విశ్లేషిస్తున్నారు.

రూ.4 లక్షల కోట్లకు చేరువలో..

బీఎస్ఈ నమోదిత కంపెనీల మార్కెట్ విలువ మళ్లీ రూ.4 లక్షల కోట్లకు చేరువైంది. ఈ రెండు రోజుల్లో మదుపరుల సంపద రూ.8,67,540.05 కోట్లు పెరగడంతో మొత్తం సంపద రూ.3,99,85,972.98 కోట్ల (4.61 ట్రిలియన్ డాలర్లు)కు చేరింది. మంగళవారం ఒక్కరోజే రూ.7 లక్షల కోట్లు పుంజుకోగా.. సోమవారం రూ.1.67 లక్షల కోట్లు పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు రావడం, రష్యా-ఉక్రెయిన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం జరుగుతుందన్న అంచనాలు, చైనా ఉద్దీపన చర్యలు.. స్టాక్ మార్కెట్లలో ర్యాలీకి దోహదం చేసినట్టు ట్రేడర్లు చెప్తున్నారు. ఇక బీఎస్ఈ మిడ్‌క్యాప్ 2.10 శాతం, స్మాల్‌క్యాప్ 2.73 శాతం పెరిగాయి.

కోలుకున్న ఓలా ఎలక్ట్రిక్ షేర్లు

ఓలా ఎలక్ట్రిక్ షేర్లు పుంజుకున్నాయి. బీఎస్ఈలో కంపెనీ షేర్ విలువ 12.56 శాతం ఎగిసి రూ.52.80 వద్ద స్థిరపడింది. ఒకానొక దశలో 15.86 శాతం పెరిగి రూ.54.35 వద్దకు వెళ్లింది. అయితే మార్కెట్ ఆరంభంలో రికార్డు కనిష్ఠాన్ని తాకుతూ రూ.46.32కు పడిపోవడం గమనార్హం. ఆర్థికపరమైన కారణాలతో సోమవారం 7 శాతానికిపైగా నష్టాలను ఓలా ఎలక్ట్రిక్ షేర్లు మూటగట్టుకున్న విషయం తెలిసిందే. ఇక ఎన్ఎస్ఈలో 12.44 శాతం వృద్ధితో రూ.52.77 వద్ద షేర్ విలువ ముగిసింది. మొత్తానికి తాజా లాభాలతో కంపెనీ మార్కెట్ విలువ రూ.2,597.98 కోట్లు ఎగిసి రూ.23,289.18 కోట్లకు చేరింది.

'సైంటిఫిక్ రిపోర్ట్స్'లో పతంజలి రెనోగ్రిట్ రిసెర్చ్

హరిద్వార్, మార్చి 18: ప్రపంచ ప్రతిష్ఠాత్మక ప్రచురణ సంస్థ 'నేచర్ పోర్ట్‌ఫోలియో'కు చెందిన 'సైంటిఫిక్ రిపోర్ట్స్' జర్నల్‌లో గత ఏడాదికిగాను వచ్చిన టాప్-100 రిసెర్చ్ పేపర్లలో పతంజలి ఆయుర్వేద్ రిసెర్చ్ అయిన 'రెనోగ్రిట్' ఆయుర్వేద ఔషధం పరిశోధనాంశాలు కూడా ఉన్నాయి. యోగ్ ఋషి స్వామీ రాందేవ్ జీ ఆదర్శంతో తమ శాస్త్రవేత్తలు పరిశోధించి ఆవిష్కరించిన ఈ హెర్బల్ ఫార్ములేషన్‌కు అంతర్జాతీయ సైంటిఫిక్ గుర్తింపు లభించడంపట్ల పతంజలి యోగ్ పీఠ్ ట్రస్ట్ ఆనందం వ్యక్తం చేసింది. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదలైంది. 2,568సార్లు రెనోగ్రిట్ రిసెర్చ్ పేపర్‌ను డౌన్‌లోడ్ చేశారని ఈ సందర్భంగా తెలిపింది. తీవ్రమైన కిడ్నీ వ్యాధులపై ఓ సాధారణ మూలికా ఔషధం.. ఎటువంటి దుష్ప్రభావాలు లేకుండా ప్రభావవంతంగా పనిచేస్తున్నదనడానికి ఇదో నిదర్శనమన్నది.

మిథనాల్ ట్రయల్ రన్ సక్సెస్

హర్షం వ్యక్తంచేసిన సింగరేణి సీఎండీ బలరామ్

హైదరాబాద్, మార్చి 18 (నమస్తే తెలంగాణ) : కార్బన్ డైయాక్సైడ్ నుంచి మిథనాల్ తయారీ యూనిట్ ట్రయల్ రన్ విజయవంతమైనట్లు సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్ ప్రకటించారు. ఈ ప్రయోగం విజయవంతంకావడం పట్ల ఆయన హర్షం వ్యక్తంచేశారు. విద్యుత్తుకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో థర్మల్ విద్యుత్తు కేంద్రాల డిమాండ్ మేరకు బొగ్గు ఉత్పత్తి, రవాణా పెంచాల్సిన అవసరం ఉన్నదని ఆయన అధికారులను ఆదేశించారు. మంగళవారం సింగరేణిభవన్ నుంచి అన్ని ఏరియా జీఎంలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. రోజుకు కనీసం 50 ర్యాకుల బొగ్గును రవాణా చేయాలని, అన్ని గనుల్లో వేసవి జాగ్రత్తలు తీసుకోవాలని ఈ సందర్భంగా అధికారులకు సూచించారు.



ఎట్టకేలకు గుమ్మడికి సీఎం దర్శనం!



గుమ్మడి నర్సయ్య నుంచి వినతులు స్వీకరిస్తున్న సీఎం

హైదరాబాద్, మార్చి 18 (నమస్తే తెలంగాణ): ఎట్టకేలకు ఇల్లందు మాజీ ఎమ్మెల్యే, సీపీఐ(ఎంఎల్, న్యూ డెమోక్రసీ) నాయకుడు గుమ్మడి నర్సయ్యకు సీఎం రేవంత్‌రెడ్డి అపాయింట్‌మెంట్ ఇచ్చారు. అసెంబ్లీ ప్రాంగణంలోని సీఎం చాంబర్‌లో గుమ్మడి నర్సయ్య ముఖ్యమంత్రితో భేటీ అయ్యారు. కాగా ఈ భేటీ అసెంబ్లీ ప్రాంగణంలో హాట్‌టాపిక్‌గా మారింది. ఖమ్మం జిల్లా ఇల్లందు నియోజకవర్గం నుంచి ఐదుసార్లు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించిన గుమ్మడి నర్సయ్య రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి ఆయనను కలిసేందుకు పలుమార్లు ప్రయత్నించారు. సచివాలయంలో, అసెంబ్లీ వద్ద, చివరికి జూబ్లీ హిల్స్‌లోని సీఎం నివాసం వద్ద పడిగాపులు కాశారు. తన నియోజకవర్గ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని తలపోశారు. ప్రతిసారి ఆయనకు నిరాశే ఎదురైంది. 'ఐదుసార్లు ఎమ్మెల్యే..అయినా దొరకని సీఎం అపాయింట్‌మెంట్' అని నమస్తే తెలంగాణ సహా పలు ప్రచార మాధ్యమాల్లో కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ నేపథ్యంలో సీఎం అపాయింట్‌మెంట్ ఇవ్వటం చర్చనీయాంశమైంది. భేటీపై గుమ్మడి నర్సయ్య మీడియాతో మాట్లాడుతూ.. 'కలిసినవా.. అంటే కలిసిన' అన్నట్టుగా సమావేశం జరిగిందని చెప్పారు. 'సీఎంను కలిశాం. చెప్పదలచుకున్న విషయాన్ని చెప్పినం' అని తెలిపారు. త్వర